సాక్షి
వరంగల్
సోమవారం । 24 । జూన్ । 2024



అప్రమత్తతే శ్రీరామరక్ష..

గతేడాది ములుగు జిల్లాలో అతిభారీ వర్షంతో ప్రాణ నష్టం, వందల కోట్ల రూపాయల ఆస్తినష్టం సంభవించింది.

- 8లో▸



మిగులు పోస్టులు భర్తీచేయాలి

మిగులు పోస్టులను వెంటనే సీనియారిటీ తదుపరి ఉన్న ఉపాధ్యాయులతో భర్తీచేయాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్ చేశారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$33^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది. సాయంత్రం వేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



కాశోజీ సెంటర్: సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు తప్పకుండా పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు.

కిరాణా షాపుల్లో పోలీసుల దాడులు



నెక్కొండ: కిరాణా, పాన్ షాపుల్లో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండల కేంద్రానికి చెందిన కర్నాటి వెంకటేశ్వర్లు ఇంటిలో దాడులు చేసి అక్రమంగా నిల్వ చేసిన రూ.61,212 విలువ గల నిషేధిత తంబాకు, గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఈ మేరకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాతపూర్వకంగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్ చక్కని వేదిక అని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న డీసీసీబీ మహాజన సభ

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మహాజన సభ ఈనెల 28న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంకు సీఈఓ ఎండీ.వజీర్ సుల్తాన్ తెలిపారు. హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి సహకార సంఘాల చైర్మన్లు హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ బీఫార్మసీ 8వ సెమిస్టర్ పరీక్షలు నేడు(సోమవారం) నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఫార్మసీ (సీబీసీఎస్) 8వ సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 24, 26, 28, జూలై 1వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు.

నేటి నుంచి 'జూడా'ల సమ్మె



ఎంజీఎం: న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జూని యర్ డాక్టర్లు ఇచ్చిన సమ్మె పిలుపులో భాగంగా సోమవారం(నేటి) నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఎంజీఎం జూనియర్ డాక్టర్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆస్పత్రిలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సకాలంలో స్టైఫండ్ విడుదలకు గ్రీన్‌చానల్ ఏర్పాటు, కేఎంసీలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, జూనియర్ డాక్టర్లకు కొత్త హాస్టల్ భవనాల నిర్మాణం, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్స్ కోసం సవరించిన గౌరవ వేతనం అమలు, వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రతా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సరిపడా మౌలిక సదుపాయాల కల్పన, ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి కొత్త భవనం నిర్మాణం, యూజీ ప్రాస్పెక్టస్ కోసం నీట్‌లో 15 శాతం రిజర్వేషన్లు తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. సమ్మె సమయంలో అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలకు దూరంగా ఉండనున్నట్లు పేర్కొన్నారు.

కొనలేం.. తినలేం

- దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు
- 10 రోజుల్లో రెట్టింపు
- ఎండల తీవ్రతతో తగ్గిన దిగుబడి
- రూ.100కు చేరిన కిలో టమాట
- రూ.60 పలుకుతున్న వంకాయ
- జిల్లాలో 3 వేల ఎకరాల్లో కూరగాయల పంటల సాగు



చెన్నారావుపేట: ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదు.. అన్నట్లు ఉంది కూరగాయల ధరల పరిస్థితి. ఒక్కసారిగా ధరలు పెరగడంతో వినియోగదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. 10 రోజుల వ్యవధిలోనే దాదాపు అన్ని రకాల కూరగాయల ధరలు రెట్టింపు కావడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రతతో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో దిగుబడులు తగ్గి ధరల పెరుగుదలకు కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ధరలు మరికొన్ని రోజుల వరకు ఇలాగే ఉంటాయని వారు పేర్కొంటున్నారు.

వర్షాభావ పరిస్థితులు.. అధిక ఉష్ణోగ్రతలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో బీర, బెండ, దొండ, వంకాయ, కాకర, కొత్తిమీర, పుదీన, టమాటతో పాటు పలు రకాల కూరగాయ పంటలు సాగవుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంటలకు భారీగా నష్టం కలిగింది. 45 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పూత మాడిపోయి దిగుబడులు తగ్గిపోయాయి. వర్షాభావ పరిస్థితులు పంటలకు నష్టం కలిగించాయని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

దిగుబడి తగ్గి.. ధరలు పెరిగి

స్థానికంగా దిగుబడి తగ్గిపోవడంతో 10 రోజుల వ్యవధిలో బీర, బెండ, టమాట, పచ్చి మిర్చి, వంకాయ, పుదీన, కొత్తిమీర, దోస, కాకరకాయ, ఉల్లిగడ్డతోపాటు ఇతర కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. తొలకరి వర్షాలతో వేసిన కూరగాయ పంటలు కొద్దిరోజుల్లో చేతికి వచ్చినా.. జూలైలో వర్షాలు అధికంగా పడితే ఆ పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీంతో ప్రజలకు కూరగాయల కొనుగోలు విషయంలో కష్టాలు తప్పే పరిస్థితి కనిపించడం లేదు. మెట్ట ప్రాంతంలో కూరగాయల పంటలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

మార్కెట్‌లో కిలో కూరగాయల ధరలు రూపాయల్లో

కూరగాయలు	10 రోజుల క్రితం	ప్రస్తుతం
టమాట	40	100
వంకాయలు	30	60
ఉల్లిపాయలు	25	45
బీరకాయలు	50	100
బెండకాయలు	30	60
పచ్చి మిర్చి	50	100
కాకరకాయలు	50	100
దొండకాయలు	40	80
క్యారెట్	40	80
బీట్‌రూట్	40	60
కొత్తిమీర	30	180
పుదీన	30	160

కొండెక్కిన టమాట..

అన్ని కూరల్లో ఎక్కువగా వినియోగించే టమాట ధర కిలో రూ. 100కు చేరుకుంది. నిజామాబాద్ జిల్లాలోని మూసాపూర్, మోర్తాడు ఆర్మూరుతోపాటు సిద్దిపేట ప్రాంతాల నుంచి వరంగల్‌కు తీసుకొచ్చేవారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, మదనపల్లి, మహారాష్ట్ర నుంచి వరంగల్‌కు టమాట దిగుమతి అవుతోంది. నెలరోజుల క్రితం రోజుకు సుమారు 50 నుంచి 60 టన్నుల వరకు దిగుమతి అయ్యేది. ప్రస్తుతం 20–30 టన్నుల వరకు రావడంతో ధర రెట్టింపైంది. ఉల్లిగడ్డ 10 రోజుల క్రితం కిలో రూ. 25 ఉండగా ప్రస్తుతం రూ.45కు చేరింది. మహారాష్ట్ర నుంచి దిగుమతి తగ్గడంతో ఉల్లి ధర పెరుగుదలకు కారణమంటున్నారు. మార్కెట్‌లో పరిస్థితి ఇలా ఉంటే తోపుడు బండ్లు, సైకిళ్లపై అమ్మే వారి వద్ద ఈ ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. ధరలు పెరగడంతో వినియోగదారులు కూడా కూరగాయలు కొనడానికి రావడం లేదని, దీంతో గిరాకీ కూడా దెబ్బతింటున్నదని వ్యాపారులు వాపోతున్నారు.

కొనడానికి వత్తలేరు..



ధరలు ఎక్కువగా ఉండటంతో గతంలో మాదిరిగా ప్రజలు కూరగాయలు కొనడానికి రావడం లేదు. దీంతో వ్యాపారం తగ్గి నష్టపోతున్నాం. కూలి కూడా పడటం లేదు. ఎండల వలన పంటలు దెబ్బతిని దిగుబడులు రాకపోవడంతో ధరలు పెరిగాయి.

- గుగులోత్ భద్రమ్మ, వ్యాపారి, చెన్నారావుపేట

పానం దరియ్యడం లేదు..



దుకాణంలో ఏ కూరగాయలు అడిగినా ధరలు మండిపోతున్నాయి. కొందామంటే పానం దరియ్యడం లేదు. రూ.100 పెట్టినా ఒక్కపూట కూర వండుకునే పరిస్థితి లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు కూరగాయల భోజనానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉల్లి, టమాట, వంకాయ, బీరకాయ ఇలా ఏది చూసినా భయమేస్తోంది.

- ములుక కళావతి, గృహిణి, పాతమగ్దుంపురం

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పీఆర్‌టీయూ (టీ) నాయకులు

కాశోజీ సెంటర్: భాషా పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, స్కూల్‌గ్రేడ్ టీచర్ల అప్‌గ్రేడేషన్‌ను ప్రభుత్వం పూర్తిచేయడంతో పీఆర్‌టీయూ (టీ) వరంగల్ శాఖ జిల్లా అధ్యక్షురాలు కొలిపాక సంగీత ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో సంగీత మాట్లాడుతూ ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేసిన సీఎం రేవంత్‌రెడ్డి, అందుకు కృషిచేసిన సంఘం బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రమేశ్, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

435 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి

- 411 మంది టీచర్ల జాయినింగ్ రిపోర్ట్
- మెడికల్ బోర్డు ఎదుట ఆరుగురు హాజరు
- డాక్టర్ల నుంచి నివేదిక రాగానే వారికి ప్రమోషన్

కాశోజీ సెంటర్: ప్రభుత్వ, లోకల్‌బాడీ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న తెలుగు, హిందీ, ఉర్దూ లాంగ్వేజ్ పండిట్లకు పదోన్నతులు లభించాయి. అదేవిధంగా పీఈటీలు స్కూల్ అసిస్టెంట్లుగా, స్కూల్ అసిస్టెంట్లు పీడీలుగా పదోన్నతి పొందారు. జిల్లాలో 435 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి డీఈఓ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు 411 మంది ఉపాధ్యాయులు జాయినింగ్ రిపోర్టు చేశారు. ఉత్తర్వులు జారీ చేసిన 15 రోజుల వ్యవధిలో సంబంధిత ఉపాధ్యాయులు రిపోర్టు చేయాలి. కానీ, ఇప్పటి వరకు 24 మంది టీచర్లు రిపోర్టు చేయలేదని సమాచారం. మెడికల్ కేటగిరీ రిజర్వేషన్ కోటాలో అప్‌గ్రేడ్ చేస్తూ పదోన్నతి కల్పించాలని 10 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు పెట్టుకున్నారు. దీంతో డీఈఓ వాసంతి లేఖ రాయడంతో ఎంజీఎం పరిపాలన అధికారి శనివారం మెడికల్ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ మేరకు మెడికల్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న 10 మంది ఉపాధ్యాయుల్లో ఆరుగురు మాత్రమే హాజరైనట్లు సమాచారం. మెడికల్ బోర్డు ఎదుట హాజరైన ఉపాధ్యాయులకు సంబంధించి డాక్టర్ల నుంచి నివేదిక డీఈఓకు అందగానే వారికి కూడా పదోన్నతులు కల్పించనున్నారు.

నకిలీలకు చెక్..

గతంలో పలువురు నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు పొందిచేసిన సంఘటనలు ఉన్నాయి. వీటిపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టి నకిలీ సర్టిఫికెట్లు తెచ్చిన వారిపై చర్యలు తీసుకున్నారు. అయితే, మళ్లీ అలాంటి అవకతవకలకు చోటు ఇవ్వకుండా ముందస్తుగానే మెడికల్ బోర్డు ఏర్పాటు చేశారు. వైద్యపరీక్షలు నిర్వహించి మెడికల్ సర్టిఫికెట్లు పొందేందుకు అవకాశం కల్పించారు. కాగా, మెడికల్ బోర్డు ఎదుట ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే హాజరు కావడం అనుమానాలకు తావిస్తోంది.


భాషా పండిట్లకు పదోన్నతులు ఇవ్వాలి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

వరంగల్: బ్యాక్‌లాగ్ కారణంగా పదోన్నతులు రాని భాషా పండిట్లకు భవిష్యత్‌లో నియామకాలు లేనందున బ్యాక్‌లాగ్ పోస్టులను సాధారణ పోస్టులుగా మార్చి పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్(1927) ఉపాధ్యాయులు కోరారు. వారు సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న 8,630 మంది భాషా పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. అప్‌గ్రేడ్ కాకుండా మిగిలిపోయిన 1,000 మంది భాషాపండిట్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్(భాష)లుగా అప్‌గ్రేడ్ చేసి పండిత వ్యవస్థను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు, బదిలీలకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కమిషనర్ దేవసేన, రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ పాల్గొన్నారు.

హేమాచలక్షేత్రంలో భక్తుల పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ఆలయంలో స్వయంభూ స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు గుట్టపై గల శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆదివారం ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ సుదూర ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు రెండు నుంచి మూడు వేల మంది వరకు భక్తులు తరలివచ్చి ఆలయంలోని స్వయంభు స్వామివారిని దర్శించుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు కార్లు, ఆటోలు, ప్రైవేట్ బస్సులు తదితర వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్నారు. ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ కారంపుడి పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చంద్ స్వామివారికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నువ్వుల నూనెతో తిల తైలాభిషేకం పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని మానవ శరీరంతో పోలి ఉండే స్వామివారి నిజరూప దర్శనం చేసుకుని పులకించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పూజారులు గోత్ర నామాలతో స్వామివారికి ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. సంతానం కోసం వచ్చి ప్రత్యేక పూజలు జరిపించుకున్న పలువురు దంపతులకు స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని పూజారులు అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దైత అమ్మవారు(వనదేవత) వద్ద కోళ్లు, మేకలను బలిచ్చి సమీపంలోని చెట్ల కింద వంటావార్పు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేసి సాయంత్రం వరకు సేదతీరి వారి స్వస్థలాలకు తరలివెళ్లారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో భక్తజన సందడి నెలకొంది. ఆలయ సీనియర్ అసిస్టెంట్ సీతారాములు, శేషు, నూతలకంటి అజయ్ పాల్గొన్నారు.


బొగత జలపాతం వద్ద పర్యాటకులు



బొగతలో పర్యాటకుల సందడి

మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెల కొంది. సెలవు రోజు కావడంతో పర్యాటకులు ఒక మోస్తరుగా తరలివచ్చారు. బొగత జలపాతంలో కేరింతలు కొడుతూ ఈతలు కొడుతూ సెల్ఫీలు దిగారు.

వాజేడు



బొగత జలపాతంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ బాధ్యతలు

- పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ఏర్పాటు
- మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం



పాఠశాలలో మొక్క నాటుతున్న విద్యార్థులు

కాశోజీ సెంటర్: అడవులు అంతరించిపోయి వాతావరణంలో పెనుమార్పులు సంభవించి పర్యావరణానికి ముప్పు పొంచి ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పెంచుతోంది. ఈక్రమంలో విద్యార్థులకు పాఠశాలస్థాయి నుంచే పర్యావరణంపై అవగాహన కల్పిస్తోంది. పాఠశాలల్లో విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, మేరీలైఫ్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏకోక్లబ్‌లను ఏర్పాట్లు చేస్తోంది. విద్యార్థి దశ నుంచే మొక్కలను సంరక్షించి, పర్యావరణాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో 1,014 పాఠశాలలు..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు 1,014 వరకు ఉన్నాయి. వీటిలో 1,06,390 మంది విద్యార్థులు చదువుతున్నారు. హైస్కూల్ విద్యార్థులతో ఈనెల 24 వరకు ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేస్తారు. ప్రతి విద్యార్థికి తమ ఇంటి పరిసర ప్రాంతంతోపాటు పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి సంరక్షించే బాధ్యతలు అప్పగించి రోజూ పర్యవేక్షణ ఉండేలా చూస్తారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి. పర్యావరణం దెబ్బతినడం మానవళి మనుగడకు ప్రమాదకరం. పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- డి.వాసంతి, డీఈఓ

ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలి



మేరీలైఫ్ పథకం అమలులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులతో ఎకో క్లబ్‌లు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి విద్యార్థి మొక్కలు నాటే విధంగా పాఠశాలల ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.

- డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి

వసూల్ రాజాలు

సాకులు చూపుతూ అనుమతుల ఫైళ్లు దాచివేత

- చేతులు తడిపితే చాలు దొడ్డిదారులు బార్లా
- కార్పొరేటర్ల సిఫారసులకూ అధికారుల వత్తాసు
- అక్రమాలకు కేంద్రంగా పట్టణ ప్రణాళికా విభాగం
- 'గ్రేటర్'లో వివాదాస్పదంగా కొందరు అధికారుల తీరు

సాక్షిప్రతినిధి, వరంగల్: గ్రేటర్ వరంగల్ నగరం వేగంగా విస్తరిస్తోంది. అందుకు అనుగుణంగానే కట్టడాలు ఊపందుకున్నాయి. ఇదే అదునుగా కొందరు దోపిడీకి తెర లేపారు. అవసరమైన వివరాలను బహిర్గతం చేయరు. అదేమంటే సాకులు చెబుతారు. ఇల్లు కడదామని ఇటుక వేస్తే నిబంధనలంటూ వాలిపోతారు. కాసులిస్తే మాత్రం వారే దొడ్డిదారులు చూపుతారు. వసూళ్లే పరమార్థంగా పారదర్శకతకు నిలువునా పాతరేశారు. వరంగల్ నగరవాసుల నుంచి ముక్కుపిండి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారు. ట్రైసిటీలో జరుగుతున్న ఈ తంతుపై గృహనిర్మాణ దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ మహా నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలోని కొందరు అధికారులు తీరుపై ఆరోపణలు నిత్యకృత్యంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదు.




నిబంధనలు వారికి అస్త్రాలు..

గృహనిర్మాణదారులందరికీ నిబంధనలపై అవగాహన ఉండదు. ఇల్లు కట్టుకుందామనుకునే వారు ఎక్కడో ఒకచోట తప్పులు చేయడం సహజం. వీటిని ఆసరాగా చేసుకుని అధికారులు,సిబ్బంది దండుకుంటున్నారు.ఈ వ్యవహారంలో కొందరు కార్పొరేటర్లు కూడా వాటాలు అందుకుంటున్నారు. నిబంధనల ప్రకారం అభివృద్ధిచెందని చోట ఇల్లు నిర్మించే వారు స్థలం విలువపై 14 శాతం అదనంగా రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఆ పరిధిలో ఏ సర్వే నంబర్లు ఉన్నాయనేది సామాన్యులకు తెలియదు. వాటి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించవు. ప్రజాప్రతినిధుల సిఫార్సులు, కార్పొరేటర్లు, లైసెన్స్‌డ్ ఇంజనీర్ల మధ్యవర్తిత్వాలతో ఇవన్నీ తెరచాటున చక్కదిద్దుతారు. ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం స్థల క్రమబద్ధీకరణ చేపట్టిన చోట భవనం నిర్మిస్తే అక్కడి విలువలో 33 శాతం అదనంగాచెల్లించాల్సి ఉంది. ఇందులోనూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ చెల్లించే అవసరం లేకుండానే పనులు చేసి లబ్ధి పొందుతున్నారు.

అంతటా అ'దన'పు వసూళ్లు..

నగరంలో జీ ప్లస్ 12 అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి అనుమతి ఇస్తారు. కానీ, అత్యధికంగా జీ ప్లస్ త్రీ,



జీ ప్లస్ 5 భవనాలు, అపార్టుమెంట్లే నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలకు పదిహేను మీటర్లు, ఆపై ఎత్తులో నిర్మించే వాటికి ముందువైపు మూడు మీటర్లు, మిగిలిన మూడు వైపులా 1.5 మీటర్లు స్థలం విడిచిపెట్టాలనేది నిబంధన. రోడ్డు 30 అడుగులుండాలి. ఇవన్నీ ఉన్నట్లు ప్లాన్‌లో చూపుతారు. అనధికారికంగా అదనపు ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. అనధికారిక ఫ్లాట్‌కు రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు వరకూ రాబడుతున్నారనే విమర్శలున్నాయి. గతంలో ఇవే ఆరోపణలపై వరంగల్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. భవన నిర్మాణ అనుమతుల్లో కొన్నింటిపై ఫిర్యాదులందిన నేపథ్యంలో తనిఖీలు చేసి ఆ ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తర్వాత అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత ఇటీవల భువనగిరి – ఆరెపల్లి బైపాస్‌రోడ్డు, దేవన్నపేట, వరంగల్ ఉర్సు గుట్ట, హనుమకొండ నయీంనగర్, సుబేదారి, బస్టాండ్ ఏరియా, నక్కలగుట్టలో వాణిజ్య కట్టడాలు, విల్లాస్ నిర్మాణాలు చేపడుతున్నారు. కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయాన్ని కూడా పక్కదారి పట్టించి అధికారులు లబ్ధి పొందుతున్నారని రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులకు మళ్లీ ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. కాగా, ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు మాత్రం తమకు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని చెప్తున్నారు. ఏసీబీ అధికారులు మాత్రం జీడబ్ల్యూసీలో వసూల్ రాజాలపై దృష్టిపెట్టినట్లు చర్చ జరుగుతోంది.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


సునీల్(ఫైల్)

కేసముద్రం: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబు ల్ సుదర్శన్ కథనం ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌లోని కిష్టాపురం కాలనీకి చెందిన కొంగరి సునీల్(34) జీవితంపై విరక్తి చెంది ఇంటికన్నె–కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వేపోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈమేరకు మృతుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహన్ని మానుకోట జిల్లా ఆసుపత్రి లోని మార్చురీలో భద్రపరిచినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కాగా, సునీల్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య ఉంది.

ఉసురు తీసిన ఆన్‌లైన్ అప్పు..

- ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం
- చల్లగరిగలో ఘటన


పైడయ్య(ఫైల్)

చిట్యాల: ఆన్‌లైన్ అప్పు ఉసురు తీసింది. అప్పు తీర్చలేక ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రేషన్ డీలర్ రజిత భర్త గొడిశాల పైడయ్య (41) కొంత కాలం క్రితం కుటుంబీకులకు తెలియకుండా ఆన్‌లైన్‌లో అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలని మనస్తాపం చెందేవాడు. ఈ క్రమంలో ఆదివారం మరోసారి అప్పు ఎలా తీర్చాలని మనోవేదనకు గురై 'నా మృతికి ఎవరూ బాధ్యులు కాదు' అని లేఖ రాసి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కూతురు నేత్ర ఉన్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్ తెలిపారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం


అక్షయ్

రామన్నపేట : జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతన్న తన కుమారుడు అక్షయ్ ఈనెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. కాలేజీలో ఫీజు నిమిత్తం రూ. 5,100 చెల్లించమని ఇవ్వగా అందులో రూ.3,900 ఫీజు మాత్రమే కట్టడంతో తండ్రి మందలించాడు. మరుసటి రోజు శుక్రవారం సాయంత్రం కాలేజీ నుంచి తిరిగి వస్తూ ములుగు రోడ్డు వద్ద కాలేజీ బస్సు దిగినట్లు డ్రైవర్ తల్లిదండ్రులకు తెలిపారు. అక్షయ్ కోసం బంధుమిత్రులు, ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దాడికి పాల్పడిన ఘటనలో నలుగురిపై కేసు

మడికొండ: దాడికి పాల్పడిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మడికొండకు చెందిన గండికొట లక్ష్మీనారాయణకు గ్రామంలో 400 గజాల ఇంటి స్థలం ఉంది. ఆదివారం ఆ స్థలంలో మడికొండ గ్రామానికే చెందిన దారంగుల రాజేశ్, తండ్రి సమ్మయ్య, మరో ఇద్దరు జేసీబీ సాయంతో చదును చేస్తుండగా లక్ష్మీనారాయణ ప్రశ్నించాడు. దీంతో సమ్మయ్య, రాజేశ్, ఇందిర, మరొ వ్యక్తి.. గండికొండ లక్ష్మీనారాయణ, సతీశ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై లక్ష్మీనారాయణ ఫి ర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దివ్య తెలిపారు.


మల్యాల గ్రామం చుట్టూ చేరుకున్న వరద (ఫైల్)


వరద ఇంట్లోకి చేరడంతో పునరావాస కేంద్రాలకు వెళ్తున్న దొడ్ల వాసులు (ఫైల్)


కొండాయిలో ఇంట్లోకి చేరిన వరద నీరు (ఫైల్)

అప్రమత్తతే శ్రీరామరక్ష..

గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షానికి జిల్లా అతలాకుతలం

- 17 మంది మృతి..
- ఇప్పటికీ ఆచూకీ దొరకని మహిళ మృతదేహం
- కోట్ల రూపాయల ఆస్తినష్టం
- ఈదఫా పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం చర్యలు


గొరారం వాగుకోతతో కొటుకుపోయిన మిర్చి నారుమడులు (ఫైల్)

ములుగు : అప్పటి వరకు వర్షపాతం సాధారణంగా నమోదైంది. దీంతో చెరువులు నిండాయి. పంటల సాగు ఊపందుకుంది. ఫలితంగా రైతులు భరోసాతో ఉన్నారు. అప్పుడే మహా ప్రళయం మొదలైంది. మామూలుగా మొదలైన వర్షం.. రోజురోజుకూ రెట్టింపు అవుతూ వచ్చింది. దీంతో మానవ రవాణా ఎక్కడికి అక్కడ స్తంభించింది. పంటలు నేలమట్టమయ్యాయి. బ్యాక్ వాటర్ కారణంగా ముంపు గ్రామాలు వరదల మధ్య చిక్కుకున్నాయి. చుట్టూ వరదలు కమ్ముకోవడంతో కాపాడడానికి ఏకంగా హెలికాప్టర్లు దిగిన రికార్డు ఉంది. కేవలం నాలుగు రోజుల్లో పదుల సంఖ్యలో ప్రాణ నష్టం, వందల కోట్ల రూపాయల ఆస్తినష్టం సంభవించింది. ఫలితంగా ఒక్కసారిగా జిల్లా రూపురేఖలు మారిపోయాయి. ఈ ఘటనలు జరిగి సంవత్సర కాలం దగ్గరికి వచ్చింది. నాటి గుర్తులు ఇంకా కళ్లెదుట కదలాడుతూనే ఉన్నాయి. అయితే అప్రమత్తతే శ్రీరామరక్షగా జిల్లా యంత్రాంగం ఈ సారి ముందడుగు వేస్తోంది.

ప్రాణాలు కోల్పోయిన 17 మంది

గతంలో ఎన్నడూ లేని విధంగా 2023–2024 మధ్యకాలంలో వర్షాలతో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. జూలై 18వ తేదీన సాధారణంగా మొదలైన వర్షం.. కేవలం మూడు రోజుల వ్యవధిలో అసాధారణ స్థాయికి చేరుకుంది. జూలై 18 నుంచి 28వ తేదీ వరకు రికార్డు స్థాయిలో 776.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో వెంకటాపురం(ఎం) మండలంలోని మారేడుగుండ చెరువు కట్టతెగి బూర్గుపేట–లక్ష్మీదేవిపేట రాకపోకలు నిలిచిపోయాయి. ఐదుగురు వరదలో కొట్టుకుపోయి మృతి చెందారు. ఇందులో బొగ్గుల బండి, బండ సారయ్య, బండ సారక్క, బండ రాజమ్మ, సాదా లక్ష్మి ఉండగా బండ రాజమ్మ మృతదేహం నేటికీ ఆచూకీ లభ్యం కాలేదు. గోవిందరావుపేట మండలంలో మహ్మద్ తన్వీర్, మహ్మద్ గౌసియా, ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో గుర్తు తెలియని యాచకుడు మృతిచెందారు. జంపన్నవాగు ఉధృతి ఎక్కువ కావడంతో చుట్టపక్కల గ్రామాలు మేడారం, రెడ్డిగూడెం, ఊరట్టం, కొత్తూరు వంటి గ్రామాలు వరదలో చిక్కుకొని తీవ్ర ఆస్తినష్టం జరిగింది. జంపన్నవాగు వరద కారణంగా ఏటూరునాగారం మండలం కొండాయి బ్రిడ్జి తెగగా ఎండీ మస్జీద్, ఎండీ అజ్జు, ఎండీ బీబీ, ఎండీ షరీఫ్, ఎండీ మహబూబ్‌ఖాన్, రషీద్, కరీమా, దబ్బకట్ల సమ్మక్క ప్రాణం విడిచారు. ఇక 642 జంతువులు వరదలో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాయి. రామప్ప బ్యాక్ వాటర్ కారణంగా నీరు జంగాలపల్లి సమీపంలోని జాతీయ రహదారికి ఇరువైపులా నిలిచిపోవడంతో ములుగు –వెంకటాపురం(ఎం)–గోవిందరావుపేట మండలాలకు రాకపోకలు నిలిచాయి. 45 ఇండ్లు పూర్తిగా నేలమట్టం కాగా, 258 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 7767 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. గోదావరి కరకట్ట కోత కారణంగా మిర్చి తోటలు జలమయంగా మారాయి. 131.22 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. అప్పటి కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే సీతక్క కోరిక మేరకు ప్రభుత్వం ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్‌లు కేటాయించింది. రామప్ప, లక్నవరం, గోదావరి బ్యాక్‌వాటర్‌తో పాటు జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలో ఆయా ప్రాంతాల్లోని చెరువుల కట్టలు తెగిపోవడంతో 27 గ్రామాలను లోతట్టు గ్రామాలుగా, 54 గ్రామాలను ఎఫెక్టెడ్ ప్రాంతాలుగా గుర్తించారు. 160 లైఫ్ జాకెట్లతో స్థానికులు, జాలర్లు, ప్రత్యేక టీంలు ప్రజలను కాపాడేందుకు రంగంలోకి దిగారు. వీరి ద్వారా 5861 మంది ఆవాసాలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

పునరావృతం కాకుండా చర్యలు

వానాకాలం మొదలైనప్పటి నుంచి జిల్లా యంత్రాంగంతో పాటు, ఆ సమయంలో ఘటనలను దగ్గరుండి చూసిన వారంతా ఆందోళనకు గురవుతున్నారు. పర్యటనకు వెళ్లిన ప్రతిసారి అధికారులకు, మంత్రి సీతక్కకు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. దీనికి స్పందించిన మంత్రి సీతక్క మే చివరి వారం నుంచే అధికారులను అప్రమత్తం చేస్తూ వస్తోంది. గత ఏడాది ఘటనలు పునరావృతం కాకుండా ములుగు జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాద్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ సూచనలు చేస్తున్నారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తే వారికి ఆహారం, నీరు, ఇతరత్ర సౌకర్యాలు కలింగించేలా ప్రణాళికను రూపొందించారు. దీనికి తోడు ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ టీఎస్ దివాకర కూడా వచ్చిరాగానే ముంపు గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజల సూచనలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా కొండాయిలో పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు అధికారులతో సమీక్ష నిర్వహించి పునరావాస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు వర్షాలు ఊపందుకోగానే కలెక్టరేట్, ఏటూరునాగారం ఐటీడీఏలో టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి గతంలో ఆయా మండలాల్లో ప్రత్యేక అధికారులుగా వ్యవహరించిన వారి నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నారు.


తెగిపోయిన కొండాయి బ్రిడ్జి

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు



గతేడాది వరదలతో జరిగిన నష్టం ఎక్కువ బాధ మిగిల్చింది. ఈసారి అలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం తరఫున జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ముంపు, లోతట్టు గ్రామాల్లో ఒకటికి రెండు సార్లు పర్యటించి చెరువులు, రోడ్లు, బ్యాక్ వాటర్ వంటి సమస్యలను దగ్గరుండి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా అవసరమైతే నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నా. ప్రజల సంక్షేమమే నా ముందున్న ప్రధాన లక్ష్యం. వర్షాకాలం పూర్తయ్యే వరకూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఇబ్బందుల్లో పాలుపంచుకుంటా.

–ధనసరి సీతక్క, రాష్ట్ర మంత్రి

రెవెన్యూ కాలనీలో మహిళ హత్య

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- నిందితుడి ఇంటి ఎదుట మృతదేహంతో ధర్నా


మంజుల (ఫైల్)

హన్మకొండ అర్బన్ : హనుమకొండ రెవెన్యూ కాలనీ పరిధిలోని నాగేంద్రనగర్‌లో ఓ మహిళ హత్యకు గురైంది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోస్టుమార్టం అనంతరం మహిళ మృతదేహాన్ని నిందితుడి ఇంటి ఎదుట వేసి మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసుల కథనం ప్రకారం.. మక్కల మంజుల (36) అనే మహిళ తన ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడితో కలిసి నాగేంద్రనగర్‌లో నివాసం ఉంటోంది. తన ఇంటికి సమీపంలో ఉండే వక్కల వెంకటస్వామితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. వెంకటస్వామి కూడా తన భార్యతో దూరంగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా ఈ నెల 21వ తేదీన ఫోన్‌లో ఇరువురికి వాగ్వాదం జరిగింది. అనంతరం వెంకటస్వామి మరో మహిళతో కలిసి అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో మంజుల ఇంటి వద్దకు వచ్చి ఆమెపై దాడికి పాల్పడి హత్య చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న మృతురాలి కూతురిని కూడా చంపుతామని బెదించారు. మంజుల మృతదేహాన్ని శనివారం పోస్టుమార్టం తరలించి ఆదివారం సాయంత్రం ఇంటికి తీసుకువచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు మృతదేహాన్ని నిందితుడి ఇంటి వద్ద వేసి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి ఘటనాస్థలికి చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూసి నిందితుడికి కఠిన శిక్షణ పడేలా చూస్తామన్నారు. వెంకటస్వామి మృతురాలిని గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వెంకటస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రస్తుతం వెంకటస్వామి పరారీలో ఉన్నట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

వ్యవసాయ బావిలో అడవి పంది


అడవి పందిని బయటకు తీస్తున్న అటవీ అధికారులు

మహబూబాబాద్ రూరల్ : వ్యవసాయ బావిలో అడవిపంది పడింది. ఈ ఘటన మహబూబాబాద్ మండలం సండ్రాలగూడెంలో చోటుచేసుకుంది. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. అటవీ శాఖ అధికారులు, స్థానికుల కథనం వివరాల ప్రకారం.. గ్రామంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో అడవి పంది పడింది. కొంత సమయం తరువాత అరుపులు వినబడడంతో స్థానికులు బావి వద్దకు వెళ్లి చూశారు. అక్కడ అడవి పందిని గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు హుటహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. గంటపాటు శ్రమించి అడవి పందిని బావి నుంచి బయటకు తీసి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

మిగులు పోస్టులు భర్తీచేయాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

విద్యారణ్యపురి: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బదిలీలు, పదోన్నతులలో ఉపాధ్యాయులు జాయిన్ కాకుండా ఉన్న మిగులు పోస్టులను వెంటనే సీనియారిటీ తదుపరి ఉన్న ఉపాధ్యాయులతో భర్తీచేయాలని ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి టీఎస్‌యూటీఎఫ్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టీచర్ల పదోన్నతుల్లో రెండు మూడు సబ్జెక్టులకు కూడా కొందరు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందుతున్నారని, వారు కోరుకున్న సబ్జెక్టును మినహాయించి మిగతా సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్లుగా తదుపరి సీనియారిటీ ఉపాధ్యాయులతో భర్తీచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లో కూడా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగమయ్య మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలు వెంటనే విడుదల చేయాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర జనరల్‌సెక్రటరీ చావా రవి మాట్లాడుతూ జీఓ 12ను సవరించి పీఎస్‌హెచ్‌ఎం పోస్టులకు బీఈడీ చేసిన వారిని కూడా అర్హులుగా గుర్తించి వారికి కూడా పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె సోమశేఖర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర బాధ్యులు సమ్మారావు, కె రంజిత్‌కుమార్,ఎస్ మల్లారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు అవారి శ్రీనివాస్, గురుకుల ఉపాధ్యాయుల కన్వీనర్ ఎల్లయ్య, టీఎస్‌యూటీఎఫ్ ఉమ్మడివరంగల్‌జిల్లాలోని వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్‌రవీందర్ పెండెం రాజు, బద్దం వెంకటరెడ్డి, తాటికాయ కుమార్,సి సుజన్‌ప్రసాద్‌రావు, చంద్రశేఖర్‌రావు, మురళి, యాకూబ్, వాసుదేవరెడ్డి, తిరుపతి, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌తో శారీరక దృఢత్వం

- ఏఎస్పీ శోభన్‌కుమార్
- కిట్స్‌లో బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


బ్యాడ్మింటన్ ఆడుతున్న బాలిక

హసన్‌పర్తి : బ్యాడ్మింటన్‌తో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం పెంపొందుతుందని ఏఎస్పీ శోభన్‌కుమార్ అన్నారు. కిట్స్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్‌జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి శోభన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాకారులు స్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి మాట్లాడుతూ బాలబాలికలతో పాటు పురుషులు,ఎంహిళల విభాగంలో సింగిల్స్,డబుల్స్ వి భాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 130మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి. రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, అసోసియేషన్ సభ్యులు మోహన్‌రావు, ఎం. శ్రీనివాస్, శ్రీధర్, ప్రొఫెసర్ సుధీర్, ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపైనే గీత కార్మికుడి మృతి

- 6 గంటల పాటు శ్రమించి కిందికి దించిన గ్రామస్తులు


తాడు సాయంతో కిందికి దించుతున్న మృతదేహం

ఐనవోలు: తాటిచెట్టు పైనే ఓ గీత కార్మికుడు మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం లింగమోరి గూడెంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర సత్తయ్య(59) రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం తాటిచెట్టు ఎక్కాడు. కల్లు తీసిన అనంతరం కిందికి దిగుతుండగా కాళ్ల గుజి జారి మోకు మీద తల కిందులుగా వేలాడుతూ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకుని సత్తయ్య మృతదేహాన్ని చెట్టుపై నుంచి కిందికి దించడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. డయల్ 100, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. రెండు పెద్ద నిచ్చెనలున్నా సుమారు 60 మీటర్ల ఎత్తు ఎక్కడానికి ఎవరూ సాహించలేదు. సుమారు 6 గంటల పాటు ప్రయత్నాలు కొనసాగాయి. చివరకు అదే గ్రామానికి చెందిన ఎండీ.గుల్‌పాషా.. నిచ్చెనల సాయంతో తాటిచెట్టుపైకి ఎక్కి మృతదేహం చుట్టూ తాళ్లు కట్టి కిందికి దించారు. కాగా, గుల్‌పాషా ధైర్య సాహసాలను గ్రామస్తులు అభినందించగా అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు కనీస సహాయక చర్యల్లో పాల్గొనక పోవడం దారుణమని చర్చించుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం సత్తయ్య మృతదేహాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సరోజన, కుమారులు రాజు, మల్లేశం కుమార్తెలు స్వరూప, మంజుల ఉన్నారు.

రామప్ప శిల్పకళ అద్భుతం

- అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్


రామప్ప ఆలయం చూస్తున్న శ్రీకాంత్

వెంకటాపురం(ఎం): రామప్ప శిల్పకళ అద్భుతంగా ఉందని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కిదాంబి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం వెంకటాపురం(ఎం) మండలం పాలంపేట గ్రామంలోని రామప్పదేవాలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం అందజేశారు. గైడ్ ద్వారా ఆలయ విశిష్టత తెలుసుకున్నారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ రామప్పశిల్పకళ అద్భుతమన్నారు. ఆ రోజుల్లోనే కాకతీయులు క్రీడలకు ప్రాధాన్యమిచ్చారనడానికి ఆలయంలో మల్లయుద్ధం లాంటి క్రీడల చిత్రాలు ఉండడం నిదర్శనమన్నారు. అనంతరం సరస్సులో బోటింగ్ చేశారు. శ్రీకాంత్ వెంట పోలీసు, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

చెరుపల్లిలో క్షుద్రపూజలు


గృహప్రవేశం కార్డుకు క్షుద్రపూజలు నిర్వహించిన ప్రదేశంలో వదిలిన వస్తువులు

మంగపేట: మండలంలోని చెరుపల్లిలో క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. గృహప్రవేశ ఆహ్వాన కార్డుకు క్షుద్రపూజలు నిర్వహించారు. ఈ ఘటన ఆదివారం వెలుగుచూసింది. చెరుపల్లికి చెందిన అచ్చ లక్ష్మీనర్సయ్య, తిరుమల దంపతులు ఈనెల 6న గృహప్రవేశం చేసి సత్యనారాయణ వ్రతం చేసుకున్నారు. అదే ఆహ్వాన పత్రికను వారంటే గిట్టనివారు కొందరు గ్రామంలోని మూడు కూడళ్లలో పెట్టి కోడి, గుడ్లు, బూడిదగుమ్మడి, మిరపకాయలు, బొమ్మలు, మొక్కజొన్న గింజలు, నిమ్మకాయలు, జిల్లేడు ఆకులు, అన్నం తదితర వస్తువులను ఒక విస్తారాకులో పెట్టి క్షద్ర పూజలు నిర్వహించారు. ఇది చూసిన గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆహ్వాన పత్రికను పెట్టి క్షుద్ర పూజలు నిర్వహించడం ఏమిటని మండిపడ్డారు. గతంలో గ్రామంలో పలు చోట్ల క్షుద్ర పూజలు చేసిన సందర్భాలున్నా ఈ విధంగా నిర్వహించడం ఇదే తొలిసారని ధ్వజమెత్తారు.